@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || గురువారం 30, మే 2024 || పేజీలు: 04



## తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై

# ముమ్మర కసరత్తు

### తెలంగాణ గీతం, రాజముద్రపై చర్చ

### సీఎం రేవంత్ నివాసంలో భట్టి తదితరుల సమాలోచన

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే29:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు దగ్గర పడుతున్న వేళ ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. అలాగే ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా సోనియాను సిఎం రేవంత్ ఆహ్వానించారు. మరోవైపు ముద్రను మార్చాలన్న నిర్ణయంతో పాటు, జజాతీయ గీతం కూడా రూపుదిద్దు కుంటోంది. ఈ క్రమంలో పనులు వేగవంతం చేశారు. తెలంగాణ గీతం, రాజముద్ర ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో.. ముఖ్యమంత్రి నివాసానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. తెలంగాణా గీతం, తెలంగాణ లోగో ఎంపిక పై వారిద్దరూ చర్చించారు. . మరోవైపు.. తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో.. గీతం రూపకల్పనపై కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణితో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష చేపట్టారు. సాయంత్రం వరకు పాటకు సంబంధించి పూర్తిస్థాయి లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. మరోవైపు.. తెలంగాణ రాజముద్రకు సంబంధించి ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లోగో, గీతాన్ని ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయనుంది. రాజముద్రకు సంబంధించి గతంలో ఉన్న రంగులే ఉండనున్నాయి. కాకపోతే.. గతంలో ఉన్న రాజముద్రకు సంబంధించి అందులో రాచరిక పోకడలు ఉన్నాయని.. తెలంగాణ అనేది ఉద్యమం, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను పొందుపరిచేలా రాజముద్ర ఉంటే బాగుటుందనే మిగతా 2లో..



## ప్లాస్టిక్‌ఫ్రీ జోన్‌గా అమ్రాబాద్

# టైగర్ రిజర్వ్

### జూలై చివరినాటికి మార్చాలని సీఎస్ ఆదేశం

### ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేదం, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపైన అవగాహన కల్పించాలి..

### పంచాయతీరాజ్, అటవీశాఖ, పీసీబీ అధికారులతో సమీక్ష

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే 29:** జూలై నెలాఖరులోగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ను పూర్తిగా ప్లాస్టిక్ రహిత జోన్‌గా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుదవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో అటవీ, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో సీఎస్ సమావేశమై చర్చించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై నిషేధం అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. కాగితపు సంచులు, గుడ్డ/జనపనార సంచులు, విస్తరాకులు మొదలైన పర్యావరణ అనుకూల ఉత్పత్తుల వినియోగం పై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నివారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిగతా 2లో..





### నేటితో చివరిదశ ఎన్నికల ప్రచారం సమాప్తం

- సాయంత్రం కన్యాకుమారి చేరుకోనున్న ప్రధాని
- ప్రధాని రాకతో భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

వివరాలు 02లో..



### మరోమారు రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్

- చంపేస్తామంటూ వరుస ఫోన్ బెదిరింపులు
- ఫోన్‌కాల్స్‌పై మరోమారు పోలీసులకు ఫిర్యాదు

వివరాలు 02లో..

## జూన్ 3నుంచి

# బడిబాట

- నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన విద్యాశాఖ


**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 3 నుంచి 19వరకు బడిబాట కార్య క్రమం నిర్వహించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఏ రోజున ఎవరేం చేయాలనే మార్గదర్శకాలను బుధవారంరాత్రి విద్యాశాఖ విడుదల చేసింది. నిర్ణయించిన తేదీల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధ్యాయులు తమ పరిధిలోని గ్రామాలు, శివారు గ్రామాలకు



వెళ్లాల్సి ఉంటుంది. చదువుకోని పిల్లలను గుర్తించి, వారిని సమీపంలోని అంగన్‌వాడీలు, స్కూళ్లలో చేర్పించడం, ప్రభుత్వ స్కూళ్లల్లో ప్రవేశాలు పెంచడం, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై మిగతా 2లో..

## నేడు కేరళకు నైరుతి

### నాలుగైదు రోజుల్లో తెలుగు రాష్ట్రాలకు విస్తరణ



వివరాలు 02లో..




# ఢిల్లీ@ 52.9

- ఉగ్రరూపం దాల్చిన భానుడు
- ముంగేష్‌పుర్‌లో 52.3డిగ్రీల సెల్షియస్ నమోదు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే29:** ఈశాన్య భారతదేశంలో భానుడి ఉగ్రరూపం కొనసాగుతోంది. సూర్య తాపానికి దేశ రాజధాని నగరం దిల్లీ వాసులు అల్లాడిపోతున్నారు. దిల్లీలో బుధ వారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దిల్లీలో మిగతా 2లో..

# హైదరాబాద్ టాలెంట్ హబ్!

- నైపుణ్యం, విభిన్న ప్రతిభకు కేంద్రంగా నగరం
- లిస్టులో నవీ ముంబై, పుణే నగరాలు కూడా..
- సులభతర వ్యాపారాలకు వీలు
- కేపీఎంజీ టాలెంట్ ఫీజిబిలిటీ నివేదికలో వెల్లడి



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:** దేశంలోని కీలక నగరాల్లో హైదరాబాద్ డైనమిక్ టాలెంట్ హబ్‌గా నిలిచింది. హైదరా బాద్‌తో పాటు నవీ ముంబై, పుణే కూడా మంచి నైపుణ్యం, విభిన్న ప్రతిభకు కేంద్రాలుగా అభివృద్ధి చెందాయని ప్రముఖ కేపీఎంజీ సంస్థ తమ టాలెంట్ ఫీజబులిటీ నివేదికలో వెల్లడించింది. క్లిష్టమైన నైపుణ్యాలు, విభిన్న ప్రతిభను కోరుకునే రిక్రూటర్ల డిమాండ్లను తీర్చే విధంగా ఈ హబ్‌లు ఎదిగాయని తెలిపింది. ముంబై, ఢిల్లీ, బెంగళూరు నగరాలు వివిధ పరిశ్రమలకు మిగతా 2లో..

నేటి ఫోకస్ న్యూస్

గురువారం 30, మే 2024

# దశాబ్ది ఉత్సవాలపై ముమ్మర కసరత్తు

(మొదటి పేజీ తరువాయి..)

ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారు. అందుకు అనుగుణంగా చిహ్నాలను పొందుపరిచే అవకాశం ఉంది. కాగా.. రాష్ట్ర గీతాన్ని రూపొందించేందుకు అందెశ్రీకి బాధ్యతలు అప్పగించగా.. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణితో కలిసి జయ జయహే తెలంగాణ పాటను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, రఘు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రు నాయక్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్, ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, తదితరులు హాజరయ్యారు.

# నేడు కేరళకు నైరుతి

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే29:** ఈశాన్య రాష్ట్రాల్లో రెమాల్ తుపాను బీభత్సం సృష్టించగా.. ఉత్తరాది రాష్ట్రాలను మండుటెండలు వణికిస్తున్నాయి. ఇటు తెలుగు రాష్ట్రాల్లోనూ మళ్లీ ఎండలు దంచికొడుతున్నాయి. ఈ క్రమంలో భారత వాతావరణ శాఖ చల్లటి వార్త చెప్పింది. మరికొద్దిగంటల్లోనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నాయని వెల్లడించింది. అంచనా వేసిన సమయానికంటే ముందే నైరుతి వస్తుండటంతో ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేరళను నైరుతి తాకిన నాలుగైదు రోజుల్లోనే ఏపీ, తెలంగాణకు కూడా విస్తరిస్తాయని వాతావరణ నిపుణులు వెల్లడించారు. నైరుతి రాకతో అగ్నిగోళంలా మండుతున్న రాష్ట్రాలు చల్లబడనున్నాయి. నైరుతి రుతుపవన కాలంలో వర్షాలు దంచికొట్టనున్నాయని పేర్కొన్నారు. గతేడాది రుతుపవనాలు అంచనా వేసిన సమయానికంటే ఆలస్యంగా వచ్చాయని, ఇప్పుడు మాత్రం రుతుపవనాల వ్యాప్తికి వాతావరణం అనుకూలంగా ఉందని చెప్పారు. కాగా.. ఉపరితల ద్రోణి, అల్పపీడనం ప్రభావంతో వారంరోజులుగా అక్కడక్కడా అడపాదడపా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఇప్పుడు అంచనా వేసిన సమయానికి రుతుపవనాలు తీరాన్ని తాకి వర్షాలు పడితే.. వ్యవసాయ పనులను కూడా ప్రారంభించవచ్చని రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

# జూన్ 3నుంచి బడిబాట

(మొదటి పేజీ తరువాయి..)

అవగాహన కల్పించడం బడిబాట ఉద్దేశం. ఈ క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక బృందాలు, ఎన్‌జీఓల తోడ్పాటు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. 3 నుంచి 19వ తేదీ వరకు ఏ రోజు ఏం చేయాలనే వివరాలతో కూడిన షెడ్యూల్‌ను కూడా విద్యాశాఖ ప్రకటించింది.

**కలెక్టర్ల నేతృత్వంలో కార్యాచరణ..**

- జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో డీఈఓలు, ఎంఈఓలు, స్కూల్ ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఈ నెల 30వ తేదీన వివిధ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహిస్తారు. బడిబాట కార్యక్రమ ప్రణాళిక ఖరారు చేస్తారు. జూన్ 10వ తేదీ నాటికి ప్రభుత్వ స్కూళ్లల్లో నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్, యూనిఫాం పంపిణీకి సిద్ధం చేస్తారు.
- సామాజిక సేవాసంస్థలు, ఎన్‌జీఓలు వివిధ వర్గాలను డీఈఓలు సమన్వయపరిచి, బడిబాటను ముందుకు తీసుకెళ్లాలి. ఎంఈఓలు, హెచ్‌ఎంలకు, టీచర్లకు బడిబాట దిశానిర్దేశం చేస్తారు. కార్యక్రమంపై విస్తృత ప్రచారం కల్పిస్తారు. మండలపరిషత్ అధికారులు, ఎస్‌ఐ, వివిధ వర్గాల నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేస్తారు.
- 'మండలస్థాయి కమిటీలను ఎంఈఓలు ఏర్పాటు చేస్తారు. ఏరోజు ఏం చేయాలనే కార్యాచరణను మండల పరిధిలో ఎంఈఓలు రూపొందిస్తారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు.
- గ్రామస్థాయిలో కమిటీలు, బడిబాటపై అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని స్కూల్ హెచ్‌ఎంలు నిర్వహిస్తారు. స్థానిక నేతల భాగస్వామ్యాన్ని తీసుకోవడంలో కీలక భూమిక పోషిస్తారు. బడిబాట ద్వారా గుర్తించిన విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ చేపడతారు.

# ఢిల్లీ@ 52.9

(మొదటి పేజీ తరువాయి..)

గతంలో ఎన్నడూలేనంతగా మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ముంగేష్‌పుర్‌లో 52.3 డిగ్రీల సెల్షియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు నమోదైన ఉష్ణోగ్రతల్లో ఇదే అత్యధికమని తెలిపారు. మంగళవారం నార్త్ వెస్ట్ దిల్లీ ప్రాంతంలో 49.9 డిగ్రీలుగా నమోదు కాగా.. ఆ మరుసటిరోజే ఉష్ణోగ్రతలు మరింతగా పెరగడంతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇదిలాఉండగా.. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఎక్కువగా ఏసీలు వినియోగించడంతో దిల్లీలో విద్యుత్ డిమాండు 8,302 మెగా వాట్‌లకు చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఇంత భారీ డిమాండ్ ఉండటం కూడా ఇదే అత్యధికమని పేర్కొన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలావుంటే ఢిల్లీలోని మధు విహార్ ప్రాంతంలోని పార్కింగ్ స్థలంలో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంటలు చెలరేగడంతో పార్కింగ్‌లో పార్క్ చేసిన 17 వాహనాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే తొమ్మిది అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నాయి. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి గంట వ్యవధిలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రస్తుతం కేసు దర్యాప్తు చేస్తున్నారు. తూర్పు ఢిల్లీలోని మండవాలి పోలీస్ స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం రాత్రి 1 గంట ప్రాంతంలో వాహనాల పార్కింగ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పార్కింగ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు మంటల్లో చిక్కుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల కారణంగా ఆ ప్రాంతంలో గందరగోళం నెలకొంది. ఘటనపై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే మండు వేసవి కారణంగానే ఇలా జరిగివుంటుందని అనుమానిస్తున్నారు.

# ప్లాస్టిక్‌ఫ్రీ జోన్‌గా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి..)

ఎ÷-లాస్టిక్ వినియోగాన్ని నివారించి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడానికి అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో అదనపు చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో ప్రచారంతో పాటు పంచాయతీలు, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. టైగర్ రిజర్వ్ ఏరియాలో ఎ÷-లాస్టిక్ వాడకంపై నిషేధం గురించి హైవే వెంట ఉన్న స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని నాలుగు ఆవాసాల్లో నివాసముంటున్న ప్రజలను తరలించే పక్రియను వేగవంతం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. హరితనిధి కింద ఉన్న నిధులను సంబందిత వార్షిక సంవత్సరంలోనే వినియోగించు కోవాలని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మైసమ్మ దేవాలయంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని ఎండోమెంట్ శాఖ అధికారులను సీఎస్ సూచించారు. ఈ కార్యక్రంలో అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి వాణీ ప్రసాద్, పంచాతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఖఅఅఈ ఆర్.యం. డోబ్రియాల్, టీఎస్‌పీసీబీ సభ్య కార్యదర్శి బుద్ధ ప్రకాష్ జ్యోతి, కమిషనర్ ఎండోమెంట్స్ హనుమంత రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ టాలెంట్ హబ్!

(మొదటి పేజీ తరువాయి..)

అవసరమైన ప్రతిభను ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. జీవన నాణ్యత, ప్రయాణ సమయం, భద్రత, కనెక్టివిటీ, ఆరోగ్య సంరక్షణ, మెరుగైన గాలి నాణ్యత అంశాల్లో ఈ మూడు నగరాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయని వివరించింది. చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లో జీవన వ్యయ సూచికలు తక్కువగా ఉన్నాయని.. బెంగళూరు, గుర్గావ్, పుణే నగరాలు స్థానికంగా అధిక కొనుగోలు శక్తిని అందిస్తున్నాయని పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో దేశంలోని 10 రంగాలకు చెందిన 40కిపైగా కంపెనీలు, హెచ్‌ఆర్ ప్రతినిధులు, నియామక బృందాలతో కలసి ఈ అధ్యయనం చేసినట్టు తెలిపింది. నవీ ముంబై, హైదరాబాద్, చెన్నై నగరాల్లో వాణిజ్య లీజు ధరలు అందుబాటులో ఉన్నాయని.. ఇది సులభతర వ్యాపారానికి వీలు కల్పిస్తుందని కేపీఎంజీ నివేదిక పేర్కొంది. దీనితో ఈ నగరాల్లో కార్యకలాపాలపై సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని తెలిపింది. అయితే పన్ను రాయితీలు, సరళీకృత విధానాలు, ఇతర అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రతిభ, ప్రభుత్వ మద్దతు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, జీవన నాణ్యత, వ్యయాలు వంటి అంశాలు సంస్థల ఏర్పాటుకు, అత్యుత్తమ ప్రతిభను ఆకర్షించడానికి కీలకమని పేర్కొంది.

# నేటితో చివరిదశ ఎన్నికల ప్రచారం సమాప్తం

**నేటి ఫోకస్ న్యూస్, కన్యాకుమారి-మే29:** దేశవ్యాప్తంగా గురువారంతో ఎన్నికల ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఏడోదశ ఎన్నికలు జూన్ 1న జరుగనున్నాయి. ఇందులో ప్రధాని మోడీ పోటీ చేస్తున్న వారణాసి కూడా ఉంది. ఈ క్రమంలో ప్రచారం ముగిసిన వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ కన్యాకుమారిలో సేదదీరనున్నారు. మోడీ సందర్శనను పురస్కరించుకుని కన్యాకుమారిలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయన భద్రత కోసం 2,000 మంది పోలీసులు, వివిధ భద్రతా ఏజెన్సీలతో మోహరించనున్నారు. స్వామి వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ధ్యానం చేసేందుకు ప్రధాని మోడీ గురువారం కన్యాకుమారి రానున్నారు. 2019లో కూడా ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం ప్రధాని మోడీ కేదార్‌నాథ్ గుహలో ధ్యానంలో కూర్చున్నారు. మే 30న లోక్‌సభ ఎన్నికల ప్రచారం పరిసమాప్తం అయిన సందర్భంగా ప్రధాని మోడీ వివేకానంద రాక్ మెమోరియల్ వద్ద ధ్యానం చేస్తారని బిజెపి నాయకులు తెలిపారు. మే 30 సాయంత్రం నుంచి జూన్ 1వ తేదీ సాయంత్రం వరకు ధ్యాన మండపం వద్ద 45 గంటల పాటు ధ్యానం చేస్తారని వారు తెలిపారు. ప్రఖ్యాత హిందూ ధర్మ ప్రచారకుడు, సాధువు స్వామి వివేకానంద ఈ ధ్యాన మండపంలోనే భారత మాత గురించి తన దార్శనికతను పొందారని ప్రజలు విశ్వసిస్తారు. మోడీ కన్యాకుమారి సందర్శనను పురస్కరించుకుని భద్రతను కట్టుదిట్టం చేశారు. రాక్ మెమోరియల్, బోట్ జెట్టీ, హెలిప్యాడ్, ప్రభుత్వ అతిథి గృహం వద్ద భద్రతా ఏర్పాట్లను తిరునల్వేలి రేంజ్ డిఐజి ప్రవేష్ కుమార్, ఎస్‌పి ఇ సుందరవదనం బుధవారం పర్యవేక్షించారు. ప్రధానికి చెందిన ప్రత్యేక భద్రతా బృందం కూడా ధ్యాన మండపం చేరుకుని భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేసింది. హెలికాప్టర్ ల్యాండింగ్ పరీక్షలను కూడా జరిపింది. అంతర్జాతీయ పర్యాటక పటంలో ఉన్న కన్యాకుమారి, చుట్టుపక్కల దాదాపు 2,000 మంది పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లను చేపట్టారు.

# ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు

**- వ్యక్తి అరెస్ట్**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్,-మే29:** ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు కేసులో బుధవారం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజాభవన్‌లో బాంబు పెట్టామని.. మరికొద్దిసేపట్లో పేలబోతుందంటూ ఓ వ్యక్తి మంగళవారం పోలీసులకు ఫోన్ చేశాడు. దాంతో అప్రమత్తమైన పోలీసులు ప్రజాభవన్‌కు చేరుకొని అణువణువు గాలించారు. 2 గంటలకుపైగా తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పద వస్తువులు ఏవీ దొరకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అకతాయి పనిగా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి ఆరా తీశారు. ఈ క్రమంలో నిందితుడు శివరామ కృష్ణను పంజాగుట్ట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం సేవించి డయల్ 100కి ఫోన్ చేసినట్లుగా గుర్తించారు.

# మరోమారు రాజాసింగ్‌కు బెదరింపు కాల్స్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే29:** తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కు మరోసారి టెర్రరిస్టుల నుంచి బెదిరింపులు వచ్చాయి. పాకిస్తాన్ నెంబర్ల నుంచి పదేపదే బెదిరింపులు రావడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని నెంబర్లు పాకిస్తాన్ నుంచి వచ్చినట్లుగా తెలుస్తోంది. ఓ ఫోన్ నెంబర్‌కు టెర్రరిస్టు ఫోటో కూడా ఉంది. రాజాసింగ్‌కు బెదిరింపులు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇప్పటికే అనేక సార్లు వచ్చాయి. రాజాసింగ్‌కు .. ఉగ్రవాదుల నుంచి తరచూ బెదిరింపులు వస్తూంటాయి. గతంలో కూడా ఇలా బెదిరింపులు రావడంతో పోలీసులు ఆరా తీశారు. పాతబస్తీకి చెందిన ఓ యువకుడు గల్ఫ్ దేశాల్లో ఉపాది పొందుతూ అక్కడ నుంచి రాజాసింగ్ కు బెదిరింపు కాల్స్ చేశారని గుర్తించారు. రాజాసింగ్‌కు టెర్రరిస్టుల నుంచి ముప్పు ఉండటంతో గతంలో భద్రత కల్పించారు. ఎమ్మెల్యేగా ఆయనకు భద్రత ఉంటుంది. అయితే ఆయనకు ఉన్న ముప్పు కారణంగా ఇంకా ఎక్కువ భద్రత కల్పించాలని కోరుకుంటున్నారు. కానీ పోలీసులు మాత్రం పెద్దగా పట్టించుకోవం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తనకు ఓ పాత వాహనాన్ని కేటాయించారని.. అది ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతుందని.. రాజాసింగ్ చెబుతూ ఉంటారు. ఆ వాహనం వల్ల రోడ్డుపై చతాలా సార్లు నిలిచిపోయి .. నడుచుకుంటూ పోవాల్సి వచ్చిందని కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటూ రాజాసింగ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తనకు వచ్చిన బెదిరింపు కాల్స్ నెంబర్లను ఆయన ట్విట్ చేశారు. బెదిరింపు కాల్స్ తనకు కొత్త కాదని.. గతంలో ఎన్నో ఫిర్యాదులు చేసినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఒక బాధ్యతగల పౌరుడిగా తనకు వస్తున్న బెదిరింపు కాల్స్ గురించి పోలీసుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. తాజాగా ఏయే నెంబర్ల నుంచి తనకు ఫోన్లు వస్తున్నాయనే విషయాన్ని రాజాసింగ్ తెలిపారు. బెదిరింపు కాల్స్‌పై ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా ఫలితం లేదని రాజాసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బెదిరింపు కాల్స్‌పై చర్యలు తీసుకుంటారా.. లేదా అనేది చూడాలన్నారు. ఈరోజు తనకు వరుసగా బెదిరింపు కాల్స్ వచ్చాయని.. పాలస్తీనాకు చెందిన వ్యక్తిగా తెలుస్తోందని రాజాసింగ్ వెల్లడించారు. ధర్మం కోసం నువ్వు పనిచేస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. తన ఫ్యామిలీని కూడా చంపేస్తామని బెదిరించారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఇలాంటివి ఎన్నో కాల్స్ వచ్చాయన్నారు. వాటిపై.. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని.. ఆయన ప్రభుత్వం వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచిచూడాలన్నారు.

# కేజ్రీవాల్‌కు సుప్రీంలో చుక్కెదురు

**- మధ్యంతర బెయిల్ పొడిగింపునకు నో**

**- 2న యధావిధిగా లొంగిపోవాలని ఆదేశం**

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే29:**



ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌కు సుప్రీంకోర్టు నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని పిటిషన్ దాఖలు చేయగా దానిని కోర్టు తిరస్కరించింది. కేజీవ్రాల్ దరఖాస్తును స్వీకరించేందుకు కోర్టు రిజిస్ట్రీ నిరాకరించింది. రెగ్యులర్ బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే స్వేచ్ఛ కేజీవ్రాల్‌కు ఇచ్చింది. కేజీవ్రాల్ దరఖాస్తు విచారణకు అర్హమైనది కాదు. ఇప్పుడు సీఎం కేజీవ్రాల్ జూన్ 2న లొంగిపోవాల్సి ఉంటుంది. మే 10న జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా కేజీవ్రాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. జూన్ 2న తీహార్ జైలులో లొంగిపోవాలని కోరారు. మే 17న పీఎంఎల్‌ఏ కేసులో అతని అరెస్టు చట్టబద్ధత పై సవాలు చేస్తూ ఈడీపై ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం, సుప్రీంకోర్టులోని మరో బెంచ్ కూడా కేజీవ్రాల్ పిటిషన్‌ను విచారించడానికి నిరాకరించింది. సీజేఐ డీవై చంద్రచూడ్‌ను సంప్రదించాలని కోరింది. అరవింద్ కేజీవ్రాల్ అకస్మాత్తుగా ఆరేడు కిలోల బరువు తగ్గినందున అనేక వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్ వ్యవధిని ఏడు రోజులు పొడిగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తిరిగి జైలుకు వెళ్లేందుకు కోర్టు నిర్దేశించిన జూన్ 2న కాకుండా జూన్ 9న లొంగిపోవాలని కేజీవ్రాల్ మే 26న దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. అతని బరువు ఆరేడు కిలోల వరకు తగ్గిందని, అతని కీటోన్ స్థాయి చాలా ఎక్కువగా ఉందని, ఇది తీవ్రమైన కిడ్నీ, గుండె జబ్బులు, క్యాన్సర్‌కు కూడా సూచిక అని పిటిషన్‌లో పేర్కొంది. ముఖ్యమంత్రికి పీఈటీ-సీటీ స్కాన్‌తోపాటు కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. మే 10న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జూన్ 1వ తేదీ వరకు అంటే 21 రోజుల వరకు కేజీవ్రాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దాని ప్రకారం జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. ఎక్సైజ్ పాలసీ స్కామ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజీవ్రాల్‌ను అరెస్టు చేశారు. జూన్ 2న కేజీవ్రాల్ లొంగిపోవాలని కోర్టు ఆదేశించింది. దీనికి ఒకరోజు ముందుగా ఏడో, చివరి దశ ఓటింగ్ జరగనుంది.

# ఢిల్లీకి తాగునీటి కష్టాలు

**- నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా**

**- ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం**

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే29:** దేశ రాజధాని ఢిల్లీలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తాజాగా బుధవారం అత్యంత స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏకంగా 52.3 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఢిల్లీ అగ్నిగుండలా మారింది. బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఇదొక పెద్ద సమస్యగా ఉంటే.. తాజాగా మరో కొత్త సమస్య హస్తినను వెంటాడుతోంది. తాగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొన్నటి దాకా బెంగళూరు నీటి సమస్యతో చాలా ఇక్కట్లు పడింది. ఇప్పుడు ఢిల్లీ వంతు వచ్చింది. ప్రజలు కనీస అవసరాలకు నీళ్లు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరైనా నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొద్ది రోజులుగా నీటికొరత వేధిస్తుండటంతో ప్రభుత్వం ఈ చర్యలకు ఉపక్రమించింది.నీటి పైపులతో కార్లను కడగడం, వాటర్ ట్యాంకర్లు ఓవర్ ఫ్లో కావడం, వాడుక నీటిని నిర్మాణ, వాణిజ్యపరమైన అవసరాల కోసం వినియోగించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు మంత్రి అతిషి ఆదేశించారు. ఇందుకోసం ఢిల్లీ వ్యాప్తంగా 200 బృందాలను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా నీటిని వృథా చేస్తే రూ.2000 జరిమానా విధించనున్నట్లు మంత్రి అతిశీ తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి బృందాలను రంగంలోకి దించేలా చర్యలు చేపట్టాలని ఢిల్లీ జల్‌బోర్డు సీఈవోకు రాసిన లేఖలో అతిశీ పేర్కొన్నారు. నిర్మాణ స్థలాలు, వాణిజ్య సంస్థల్లో ఏవైనా అక్రమ నీటి కనెక్షన్లు ఉంటే తొలగించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వ కుట్రతో తాగునీటి కష్టాలు వచ్చాయని ఢిల్లీ పోలింగ్‌కు ముందు మంత్రి అతిషి ఆరోపించారు. హర్యానా సర్కార్‌తో కుట్ర పన్ని తాగునీటి కష్టాలు కేంద్రం రప్పించిందని ఆమె పేర్కొన్నారు. ఇక హర్యానా నుంచి తమకు రావాల్సిన నీటి వాటా కోసం ఆప్ సర్కార్ పోట్లాడుతుందని మంత్రి తాజాగా వెల్లడించారు.

# మోడీ లాంటి ప్రధాని అవసరం లేదు

**- కావాలంటే ఓ గుడి కట్టిస్తాం పూజించుకోండి**

**- కోల్‌కతా ర్యాలీలో మమతా బెనర్జీ విమర్శలు**

**నేటి ఫోకస్ న్యూస్, కోల్‌కతా-మే29:** భారతదేశానికి నరేంద్ర మోదీ లాంటి ప్రధానమంత్రి అవసరం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. తాను ఎంతో మంది ప్రధానమంత్రులతో కలిసి పని చేశానని, కానీ మోదీ లాంటి వ్యక్తిని ఎప్పుడూ చూడలేదని దుయ్యబట్టారు. దేవుళ్లు రాజకీయాలు చేయకూడదని, అల్లర్లను ప్రేరేపించకూడదని విమర్శించారు. తాను బయోలాజికల్‌గా జన్మించ లేదని, ఒక లక్ష్యం కోసం ఆ దేవుడే తనని ఈ భూమి మీదకు పంపించాడని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఆమె ఈ విధంగా స్పందించారు. కోల్‌కతాలో నిర్వహించిన ఓ ర్యాలీలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. 'ఒకరేమో ప్రధాని మోదీ దేవుళ్లకే దేవుడు అంటారు. ఒక నాయకుడేమో సాక్షాత్తు ఆ జగన్నాథుడే మోదీకి భక్తుడని చెప్తాడు. ఒకవేళ మోదీ దేవుడే అయితే, ఆయన రాజకీయాలు చేయకూడదు. దేవుడు అల్లర్లను ప్రేరేపించకూడదు. కావాలంటే ఆయన కోసం ఒక గుడి నిర్మించి, తరచూ పూజలు నిర్వహిద్దాం. పువ్వులు, ప్రసాదాలు సమర్పిద్దాం అన్నారు.

# 31న కామారెడ్డి వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక

**- ఇసి ఆదేశాలతో సమావేశం**

**నేటి ఫోకస్ న్యూస్, కామారెడ్డి-మే29:** కామారెడ్డి మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఎన్నికన ఈ నెల 31న జరుగనుంది. ఈ మేరకు అధికారులకు ఈసీ ఆదేశించింది. ఈ మేరకు ఆ రోజు బల్దియా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా ఉన్న నిట్టు జాహ్నవిని ఇటీవల అవిశ్వాస తీర్మానం ద్వారా పదవి నుంచి దించేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 15న నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఇందుప్రియను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. దీంతో వైస్ చైర్‌పర్సన్ స్థానం ఖాళీ అయింది. ప్రస్తుతం ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఈ నెల 31న బల్దియా సమావేశం ఏర్పాటు చేయాలని ఈసీ తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఆ రోజు వీలు కాని పక్షంలో మరుసటి రోజు సమావేశం నిర్వహించి ఎన్నిక చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నది.

# జూన్1న తెలంగాణ ఉద్యమ కవాతు

- గన్ పార్క్ నుంచి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ
- బీఆర్ఎస్ నేత కర్నె ప్రభాకర్ వెల్లడి
- తెలంగాణ చిహ్నాల మార్పు తగదన్న దాసోజు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే29:**

తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన కవాతు గుర్తుకు వచ్చేలా ర్యాలీ జరుపుతామని బీఆర్ఎస్ నేత కర్నె ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా ర్యాలీ జూన్ 1వ తేదీన సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ నుంచి ప్రారంభమై తెలంగాణ అమరవీరుల స్తూపం గన్ పార్క్ వద్దకు చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడ కేసీఆర్ అమరులకు నివాళులు అర్పించిన తర్వాత అక్కడి నుంచి సచివాలయం ముందు ఉన్న తెలంగాణ అమరుల చిహ్నాం వరకు చేరుకుంటుందని తెలిపారు. ఈ ర్యాలీలో 1000 మంది కళాకారులతో పాటు తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యమైన అడ్వకేట్లు, డాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యమంలో పని చేసిన ఉద్యోగులు, మహిళలు అందరూ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఇదిలావుంటు ప్రజాపాలన అంటే పిల్లలాటగా ఉందా? అని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తానని అధికారం హస్తగతం చేసుకున్న రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌పై అక్కసుతో ప్రజాభ్యుదయానికి సంబంధం లేకుండా ప్రభుత్వ గుర్తులను మార్చి, తెలంగాణ చరిత్ర ఆనవాళ్లను తుడిచివేసే పనిలో పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్ర మార్చాలని అనుకోవడం రేవంత్ రెడ్డి అవివేకానికి, మూర్ఖత్వానికి, మరుగుజ్జు మనస్తత్వానికి పరాకాష్ట అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ప్రభుత్వ గుర్తులను మార్చడం తుగ్లక్ చర్య అని దాసోజ్ శ్రవణ్ అన్నారు. ఒకవేళ రేపో మాపో భవిష్యత్తులో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవాల్సి వస్తే.. ఆ తర్వాత వచ్చే ముఖ్యమంత్రి కొత్త లోగో తీసుకురావాలా? అని ప్రశ్నించారు. ఒకవేళ మార్చాల్సిన అవసరమే ఉంటే.. ముందుగా ప్రజలను ఒప్పించి మెప్పించాలని తెలిపారు. అంతేకాని.. సీఎం తన వంది మాగధుల సొంత నిర్ణయం కాకూడదని సూచించారు. అన్ని వర్గాల ప్రజల నిర్ణయం కావాలని.. కనీసం అసెంబ్లీలోనైనా చర్చ జరగాలని అన్నారు. ఏది పడితే అది చేయడానికి ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి రాజు కాదు అని అని కేవలం ప్రధాన సేవకుడు మాత్రమే అని తెలిపారు. ఆ పదవి కూడా శాశ్వతం కాదని చెప్పారు.

# నిబంధనల మేరకే అనుమతి

- సోమ్ డిస్టిలరీస్ కంపెనీ ఉత్పత్తులకు అనుమతి
- కొత్త మద్యం బ్రాండ్లపై ఎటువంటి దరఖాస్తులు రాలేదు
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే29:**

తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లపై రాజకీయ దుమారం రేగింది.. కొత్త మద్యం బ్రాండ్లకు రేవంత్ సర్కార్ అనుమతులు ఇచ్చిందంటూ బీఆర్ఎస్ నేతలు పలు విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో.. సోమ్ డిస్టిలరీస్ కంపెనీకి అనుమతులు ఇవ్వడం, కొత్త మద్యం బ్రాండ్లపై వస్తున్న విమర్శలపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. నిబంధనల మేరకే సోమ్ డిస్టిలరీస్ కంపెనీ ఉత్పత్తులను తెలంగాణ బేవరేజెస్ కార్పోరేషన్‌కు సరఫరా చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు జూపల్లి కృష్ణారావు చెప్పారు. కొత్త మద్యం బ్రాండ్లకు సంబంధించి తమ దగ్గరకు ఎటువంటి దరఖాస్తులు రాలేదని ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే నాలుగేళ్ల కిందట కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇచ్చారంటూ వివరించారు. ప్రొసీజర్ ప్రకారమే బెవరేజెస్ కార్పొరేషన్ నిర్ణయాలు తీసుకుంటుందనీ, కార్పొరేషన్ రోజువారీ కార్యకలాపాలు తన దృష్టికి రావని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. కొత్త మద్యం బ్రాండ్లకు సంబంధించి తమ వద్దకు ఎలాంటి దరఖాస్తులు రాలేదని గతంలో ఓ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నట్లు జూపల్లి వివరించారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. నిర్ణయం తీసుకునే అధికారం బేవరేజెస్ కార్పొరేషన్‌కు ఉందని.. దాని ప్రకారమే అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. డిమాండ్ %-% సప్లైని బట్టి కొత్త కంపెనీలకు బేవరేజెస్ కంపెనీ అనుమతులు ఇస్తుందని గుర్తించాలని సూచించారు. సోమ్ డిస్టిలరీస్ రెండు దశాబ్దాలుగా.. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సరఫరా చేస్తోందని.. ఎక్కడా నిబంధనల ఉల్లంఘన జరగలేదని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలోనూ కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇచ్చారంటూ గుర్తు చేశారు. బేవరేజెస్ కంపెనీకి అనుమతులు ఇవ్వడంపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 2020-21 సంవత్సరంలో 50 లిక్కర్ బ్రాండ్లు, 5 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2021-22లో 75 లిక్కర్, 8 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2022-23లో 122 లిక్కర్ బ్రాండ్లు, 11 బీర్ బ్రాండ్ల కంపెనీలకు, 2023-24లో 41 లిక్కర్ బ్రాండ్లు, 9 బీర్ బ్రాండ్ల కంపెనీలకు గత ప్రభుత్వం అనుమతులిచ్చిందంటూ మంత్రి జూపల్లి తెలిపారు.

# బిజెపిని ఓడించేందుకే కాంగ్రెస్‌తో పొత్తు

- మోడీ కొనసాగితే రష్యాలో పుతిన్ లాగే నియంతృత్వం
- ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం
- మీడియా ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ వ్యాఖ్యలు

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మే29:**

ఈ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అందుకే కాంగ్రెస్‌తో జతకట్టామని, ఇది శాశ్వతం కాదని స్పష్టంచేశారు. ప్రస్తుతం దేశంలో నియంత పాలన, గుండాగిరి నడుస్తుంది.. దీనికి చరమ గీతం పాడడం కోసమే కాంగ్రెస్ పార్టీతో ఆప్ పొత్తు పెట్టుకుందని ఆయన తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీతో ఆప్ పొత్తు శాశ్వతంగా ఉండదని ఈ సందర్భంగా కేజ్రీవాల్ కుండ బద్దలు కొట్టారు. బుధవారం మీడియాకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ మాట్లాడారు. జూన్ 4వ తేదీన లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో వెలువడ నున్నాయని.. అందులో ఇండియా కూటమి ఘన విజయం సాధిస్తుందని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ఢిల్లీలోని 7 లోక్‌సభ స్థానాల్లోనే కాంగ్రెస్ పార్టీతో తమ పార్టీ పొత్తు పెట్టుకుందని గుర్తు చేశారు. పక్కనే ఉన్న పంజాబ్‌లో మాత్రం ఆప్, కాంగ్రెస్ పార్టీలు ప్రత్యర్థి పార్టీలుగానే బరిలో నిలిచామని ఆయన వివరించారు. దేశాన్ని రక్షించడం కోసం.. బీజేపీని ఓడించడం కోసమే కాంగ్రెస్, ఆప్‌లు కలిసి ఒక అభ్యర్థిని బరిలో దింపామని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. అయితే పంజాబ్‌లో బీజేపీకి మనుగడ లేదన్నారు.

అలాగే ఢిల్లీ మద్యం కేసు.. మనీ లాండరింగ్ వ్యవహారంలో తాను డిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదన్నారు. అయితే తాను సీఎం పదవికి రాజీనామా చేయాలని బీజేపీ మాత్రమే కోరుకుంటుందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఇక బీజేపీ ముచ్చటగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తే మాత్రం దేశంలో ప్రముఖ రాజకీయ నేతలంతా జైళ్లలోకి వెళ్లడం ఖాయమన్నారు. ఇంకా సోదాహరణగా చెప్పాలంటే పుతిన్ సారథ్యంలో రష్యాలో పరిస్థితి ఎలా ఉందో.. దాదాపు అదే పరిస్థితి భారత్‌లో వస్తుందన్నారు. రోవైపు తన పార్టీ నేతలు సత్యంద్ర జైన్, మనీష్ సిసోడియాలు బీజేపీలో చేరితే వెంటనే బెయిల్ లభిస్తుందంటూ ఆ పార్టీ నేతల నుంచి సందేశాలు వెళ్లినట్లు తన వద్ద సమాచారం ఉందన్నారు. ఇక సీఎం కేజ్రీవాల్ వ్యక్తిగత సహాయకుడు బిభవ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలివాల్ ఘటనపై స్పందించేందుకు కేజ్రీవాల్ నిరాకరించారు.

## సరిహద్దు వెంబడి చైనా

# కుటిల యత్నాలు

## పుట్టగొడుగుల్లా వెలిసిన సైనిక గ్రామాలు!

**నేటి ఫోకస్ న్యూస్, అక్సాయ్ చిన్-మే29:**

డ్రాగన్ కంత్రీ కంత్రి పనులకు అడ్డుకట్ట పడటంలేదు. ఎప్పుడూ ఏదో ఒక రూపంలో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన క్రియేట్ చేస్తోంది. ఇప్పటికే ప్రపంచంలోని అనేక దేశాలు చైనాపై గూఢచర్యం, హ్యాకింగ్ ఆరోపణలు చేస్తూనే ఉన్నాయి. మరోవైపు అరుణాచల్‌పై అడపాదడపా వాతం పట్టుకుని, మూర్ఛరోగిలా గిలాగిలా కొట్టుకోవడం చైనాకు అలవాటే పోయింది. నైన్టీన్ ఫిఫ్టీస్ తర్వాత హిందీ-చీనీ భాయిభాయి అంటూ చాచానెహ్రూ ఇచ్చిన నినాదం.. ఆ తర్వాత వన్‌సైడ్ లవ్వుగా మిగిలిపోయింది. రెండు దేశాల మధ్య 3500 కిలోమీటర్ల సరిహద్దు వివాదం కారణంగా 1962లో చైనాతో నేరుగా యుద్ధమే చెయ్యాల్సి వచ్చింది. టిబెట్‌తోపాటు అరుణాచల్ కూడా తమదే అంటూ తమ ఇంటర్నేషనల్ మ్యాపుల్ని చూపించేది. ఇక్కడ భారత దేశంలోనే అతిపెద్ద బౌద్ధ మందిరం ఉన్న తవాంగ్ ఉత్తర భాగం కూడా తమదేనని చెప్పుకునేది చైనా. 1962 యుద్ధంలో గెలిచినా తవాంగ్ నుంచి వెనక్కు వెళ్లిపోయింది చైనా. ఆ తర్వాత భారత్ ఈ ప్రాంతంపై పూర్తిగా పట్టు సాధించింది. అయితే తాజాగా భారత్‌తో సరిహద్దుకు సమీపంలో డ్యూయల్ యూజ్ గ్రామాలను నిర్మించడంలో చైనా బిజీగా ఉంది. ఇది కాకుండా, సైనిక సౌకర్యాల నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది కంత్రీ కంత్రీ. నిర్జనమైన, ఎవరు చేరుకోలేని హిమాలయాలలో, చైనా భారతదేశంతో తీవ్ర వివాదాస్పద సరిహద్దులో వందలాది గ్రామాలను నిర్మిస్తోందని వాషింగ్టన్ థింక్ ట్యాంక్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ (%జూ×ూ%) మే 16న ఒక కొత్త నివేదిక పేర్కొంది. జియోస్పేషియల్ డేటా ప్రొవైడర్ సెంటినెల్ హబ్ నుండి వచ్చిన ఉపగ్రహ చిత్రాలు 2022 %-% 2024 మధ్య దాని విస్తరణను చూపుతున్నాయి న్యూస్‌వీక్ పేర్కొంది. భారత్ విషయంలో చైనా తన దమననీతిని ప్రదర్శిస్తునే ఉంది. ఇటీవల విడుదల చేసిన 2023 ప్రామాణిక మ్యాప్‌లో మొత్తం అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రం, అక్సాయ్ చిన్ ప్రాంతమంతా తమ భూభాగమని చైనా ప్రకటించుకుంది. ఆగస్టు 28న విడుదల చేసిన ఈ మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని దక్షిణ టిబెట్‌గా పేర్కొంది. 1962 యుద్ధంలో ఆక్రమించుకున్న అక్సాయ్ చిన్ ప్రాంతం తమదని చైనా పేర్కొంది. అంతే కాదు తైవాన్, వివాదాస్పద దక్షిణ చైనా సముద్రాన్ని కూడా తమ భూభాగమేనని మ్యాప్ ద్వారా చైనా చూపింది. చైనా సర్వేయింగ్, మ్యాపింగ్ పబ్లిసిటీ డే వేడుకల్లో భాగంగా చైనా ఈ మ్యాప్ విడుదల చేసింది. మరో వైపు అరుణాచల్ ప్రదేశ్ ఎప్పుడూ తమ భూభాగమేనని, అది ఎప్పటికీ అలాగే ఉంటుందని అనేక సందర్భాల్లో భారత్ స్పష్టం చేసింది. కానీ తాజాగా %జూ×ూ% నివేదిక ప్రకారం అరుణాచల్ ప్రదేశ్ సమీపంలోని నాలుగు వేర్వేరు ప్రదేశాలలో సైనిక, ద్వంద్వ వినియోగ గ్రామ మౌలిక సదుపాయాల విస్తరణను చేపట్టినట్లు వెల్లడించింది. ఇది యారోతో పాటు జువాంగ్నాన్, మజిదున్‌కున్, కుయికియోంగ్‌మెన్‌లలో సైనిక సౌకర్యాలను విస్తరించినట్లు వెల్లడించింది. అరుణాచల్ భారతదేశంలో అంతర్భాగమైన ప్రాంతం. అయితే చైనా దానిని తమ భూభాగంగా పేర్కొంటోంది. గ్రేజోన్ వ్యూహంతో సరిహద్దులో చైనా గ్రామాలను నిర్మిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు రహస్యంగా దూకుడు సైనిక దళాలను ఈ ప్రాంతంలో మోహరించవచ్చని హెచ్చరించారు. సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ 2018 %-% 2022 మధ్య, చైనా 624 'జియోకాంగ్' గ్రామాలను నిర్మించిందని, ఇక పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. భారత సరిహద్దులో సైనికుల మధ్య ఘర్షణ జరగడంతో ఉద్రిక్తత కొనసాగుతోంది. డిసెంబర్ 2020లో చైనా, భారత్ సైనికుల మధ్య యుద్ధం జరిగింది. 1962లో సరిహద్దు విషయంలో ఇరు దేశాల మధ్య యుద్ధం జరిగింది. గత మూడేళ్లుగా ఘర్షణలు కూడా పెరుగుతున్నాయి. సరిహద్దు వివాదానికి స్పష్టమైన పరిష్కారం లభించలేదని నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న సైనికీకరణ కారణంగా రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకుంటోంది. సరిహద్దు దగ్గర వేగంగా అభివృద్ధి చెందడం చైనా మౌలిక సదుపాయాల కల్పనకు నిదర్శనం. గతేడాది యారావో సమీపంలో కొత్త రోడ్డు, రెండు హెలిప్యాడ్‌లు కూడా నిర్మించారు. 3,900 మీటర్ల ఎత్తులో ఉన్న యారావోలో కఠినమైన వాతావరణ పరిస్థితులు ఉన్నందున, చైనా 2022 డిసెంబర్ నాటికి కొత్త భవనాలను నిర్మించగలిగిందని నివేదిక పేర్కొంది. టిబెటన్, హాన్ జనాభా కలయికతో చైనా సరిహద్దు ప్రాంతాలలో జనాభాను కూడా మారుస్తోందని నిపుణులు అంటున్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై సిబిఐ విచారణ

- కెసిఆర్ నీచ రాజకీయాలకు పరాకాష్ట
- వెంటనే రేవంత్ చర్యలకు ఉపక్రమించాలి
- బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే29:**

కేసీఆర్ ప్రభుత్వం ద్రోహానికి పాల్పడిందని.. నీచమైన స్థాయికి దిగజారిందంటూ బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. రేవంత్‌పై ఢిల్లీ పెద్దల ఒత్తిడి లేదంటే వెంటనే ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులు, పాత్రదారులపై చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. అంతేకాదు.. ఈ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరిగితేనే న్యాయం జరుగుతుందన్నారు. కేసీఆర్.. దిగజారుడు రాజకీయాలు చేశారని.. వ్యక్తిగత స్వేచ్ఛను హరించారంటూ ఫైర్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ సంచలన కామెంట్స్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తులో అనేక సంచలనాత్మక విషయాలు బయట పడుతున్నాయని.. ఈ వ్యవహారంపై రేవంత్ సర్కార్ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తప్పు చేస్తే జైలుకు పంపిస్తామని రేవంత్ చెప్పారని.. ఇన్ని సంచలన విషయాలు బయటకు వస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కామ్‌పై దర్యాప్తు, విచారణ అన్నారు.. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పత్రాల లీక్‌పై చర్యలు అన్నారు.. డ్రగ్స్‌పై చర్యలన్నారు.. ఏవీ పట్టించుకోవడం లేదని రేవంత్ సర్కార్ తీరును లక్ష్మణ్ తూర్పారబట్టారు.

# పోలీస్ కస్టడీకి ఏసీపీ ఉమామహేశ్వర రావు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే29:**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టైన హైదరాబాద్ సీసీఎస్ ఏసీపీ ఉమామహేశ్వరరావును పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ఉమామహేశ్వరరావు ని ఏసీబీ అధికారులు విచారణ చేస్తున్నారు. ఉమామహేశ్వరరావును ముగ్గురు అధికారుల బృందం విచారణ చేస్తోంది. ఉమామహేశ్వరరావు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. బినామీ ఆస్తులపై కూడా ఏసీబీ విచారణ చేస్తోంది. రెండు బ్యాంక్ లాకర్లను ఏసీబీ అధికారులు ఓపెన్ చేయనున్నారు. ఏసీబీ విచారణలో మరి కొంత మంది బినామీలు వ్యవహారం బయట పడే అవకాశం ఉంది. ఇబ్రహీంపట్నంలో ఏసీపీగా పని చేసిన సమయంలో జరిగిన అక్రమాలపై లోతుగా విచారణ నిర్వహిస్తున్నారు. అక్రమాస్తుల వివరాలను వెలికి తీసేందుకు ఏసీపీని తమ కస్టడీకి అప్పగించాలంటూ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు సానుకూలంగా స్పందించి.. మూడు రోజుల పాటు కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఏసీపీ ఉమామహేశ్వరరావు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ నెల 22న ఆయన నివాసంలో అధికారులు సోదాలు చేసి రూ.3.95 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించారు. ఆ వెంటనే ఏసీపీని అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా.. ఉమా మహేశ్వరరావుకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. చంచల్‌గూడ జైలులో ఉన్న ఆయనను నేడు అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ సూత్రధారి..

# పాత్రధారి కెసిఆర్

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, జగిత్యాల-మే29:**

ట్యాపింగ్‌లో ప్రధాన బాధ్యుడు కేసీఆరేనని మాజీ సీఎం కేసీఆర్ పైకాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఇందులో ప్రధాన సూత్రధారి, దోషి కూడా కెసిఆర్ అని అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ స్వయం కృపారాధం వల్లే అధికారం కోల్పోయారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుని సీబీఐ విచారణ చేపట్టాలని కోరారు. దేశంలో ప్రధాని మోదీ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని అన్నారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు చేసే బీజేపీని ఓడించాలని పిలుపుని చ్చారు. గతంలో ఆంధ్రా సినిమాలకు పన్ను మినహాయింపు ఇచ్చిన బీఆర్ఎస్.. ఇప్పుడు రాష్ట్రగీతాన్ని కీరవాణితో పాడించడాన్ని తప్పు పట్టడం విడ్డూరంగా ఉందన్నారు జీవన్ రెడ్డి. అన్ని వర్గాల్లో ఆర్థిక వెనుకబడిన వారికి ఇచా రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు.

# పిల్లల అమ్మకాలపై దర్యాప్తు ముమ్మరం

- ఇతర రాష్ట్రాల్లో మూలాలపై కూపీ
- పిల్లలను వదిలి ఉండలేమంటూ బాధితులు రోదన

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మే29:**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా యాక్టివిటీస్ ఇతరాష్ట్రాల్లో కూడా ఉన్నట్టు పోలీసుసు అనుమానిస్తున్నారు. ఆ దిశగా రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంకా ఏ యే రాష్టాల్లో ఈ ముఠా కార్యకలాపాలు చేపట్టిందో ఆరా తీస్తున్నారు. ప్రస్తుతానికి ఓ బృందం ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. చైల్డ్ ట్రాఫిక్ కేసులో ఇప్పటి వరకు అరెస్టు చేసిన నిందితులు ఇచ్చిన సమాచారంతో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఈ కేసులో కిరణ్, ప్రీతిదే కీలక పాత్రగా అనుమానిస్తున్నారు. వాళ్ల కోసం వేట మొదలు పెట్టారు. 50 మందికిపైగా చిన్నారులను విక్రయించినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వీరిలో 16 మందిని గుర్తించారు. ఇంకా మిగతా వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పిల్లల్ని కొనుగోలు చేసిన తల్లిదండ్రులపై కేసులు పెట్టడం ఇక్క మరో ట్విస్టు. దీంతో ఆ ఫ్యామిలీలు బోరున విలపిస్తున్నాయి. తెలిసో తెలియకో పిల్లలు లేరని బెంగతోనో చిన్నారులను కొనుక్కున్నామని వాపోతున్నారు. ఇన్ని రోజులు పెంచుకున్న మమకారంతో వారిని విడిచి పెట్టలేక పోలీస్‌స్టేషన్ వద్దే కన్నీరు మున్నీరుగా విలపించారు. తాము ఆ బిడ్డల్ని కనకపోయినా కడుపులో పెట్టుకొని అంతకంటే ఎక్కువగా పెంచుకున్నామని అంటున్నారు. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న చిన్నారులను దూరం చేయొద్దని వేడుకుంటున్నారు. సంతానం లేక ఇబ్బంది పడుతున్న ఫ్యామిలీలు పిల్లల కోసం లక్షలు వెచ్చించారు. ఏదో రూపంలో ఇంట్లోకి పిల్లలు వస్తున్నారన్న ఆనందంతో తప్పులు చేస్తున్నారు. పిల్లల్ని ఇలా దత్తత తీసుకోవాలంటే దానికో నియామవళి ఉంది. అప్పుడే అధికారులు దాన్ని గుర్తిస్తారు. ఇలా ఎవరి వద్ద పడిదే వాళ్ల వద్ద కొంటే సమస్యలు కొని తెచ్చుకున్నట్టే. ఇలా పిల్లల్ని కొనుగోలు చేస్తున్న వారిలో చాలా మంది ఆర్థికంగా కూడా అంతంత మాత్రంగానే ఉన్నవాళ్లు ఉన్నారు. ఇలాంటి వాళ్లు కూడా అప్పులు చేసి డబ్బులు చెల్లించి పిల్లల్ని కొంటున్నారు. ఇలాంటి ముఠాల్లో ఆర్ఎంపీలు, ఆసుపత్రుల్లో పని చేసే సిబ్బంది పాత్ర ఎక్కువగా ఉంటోంది. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన కేసులో కూడా నిందితులుగా ఆరఎంపీలు, ఇతర ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు. శోభారాణి అనే ఆర్ఎంపీ ఈ విక్రయాలు జరుపుతున్నట్టు గుర్తించి చెక్ పెట్టారు.

# కంటైనర్‌లో ఊపిరాడక 15గోవుల మృత్యువాత

- సూర్యాపేట వద్ద అడ్డుకుని పట్టుకున్న పోలీసులు

**నేటి ఫోకస్ న్యూస్, సూర్యాపేట-మే29:**

అక్రమంగా గోవులను తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఆవులను కంటైనర్‌లో తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. సూర్యాపేట నుంచి ఏపీ వైపు వెళ్తుండగా సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం చెక్‌పోస్టు వద్ద కంటైనర్ పట్టుబడింది. కంటైనర్‌ను పోలీసులు తనిఖీ చేశారు. కంటైనర్ లో మొత్తం 26 ఆవులు ఉన్నట్టు గుర్తించారు. అందులో ఊపిరాడక 15 ఆవులు మృతి చెందినట్టు నిర్ధారించారు. తొమ్మిది ఆవులను నల్గొండ గోశాలకు తరలించారు. పల్నాడు జిల్లా గురజాలకు చెందినవిగా గుర్తించారు. రెండు ఆవులకు కాళ్లు విరగడంతో చికిత్స అందిస్తున్నారు. చనిపోయిన ఆవులకు వెటర్నరీ డాక్టర్స్?? పోస్టుమార్టం నిర్వహించారు. ఆవులను తరలిస్తున్న నలుగురు తమిళనాడు వాసులను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

# అప్పు తీర్చలేక సెల్ఫీతో ఆత్మహత్య

**నేటి ఫోకస్ న్యూస్, మేడ్చల్-మే29:**

తీసుకున్న అప్పు చెల్లించలేక ఓ వ్యక్తి సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జీనోంవ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన మహేందర్(35) అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 2023లో రూ.6 లక్షల అప్పు తీసుకున్నారు. అందులో ఆ వ్యక్తికి రూ.4.70 లక్షలు తిరిగి చెల్లించారు. మిగిలిన డబ్బులు చెల్లించాలని అప్పిచ్చిన వ్యక్తి ఒత్తిడి చేయటంతో బాధితుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తన బాధను ఫోన్ లో సెల్ఫీ వీడియో తీసి పాత ఇనుప సామాను దుకాణంలో దూలానికి నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

# గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

- కాంగ్రెస్, బిజెపిలకు గుణపాఠం తప్పదన్న వేముల
- కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు చేసిన అధికారులు

**నేటి ఫోకస్ న్యూస్, నిజామాబాద్-మే29:**

ఎన్నికల కౌంటింగ్‌కు మరో నాలుగైదు రోజులే ఉండడంతో ఇప్పుడు నిజామాబాద్ గెలుపెవరిదన్న చర్చ జోరుగా సాగుతోంది. అధికార కాంగ్రెస్ మాత్రం జీవన్ రెడ్డి విజయం ఖాయమని చెబుతోంది. అయితే మళ్లీ ధర్మపురి అర్వింద్ గెలుస్తాడని బిజెపి లెక్కలు వేస్తోంది. కాంగ్రెస్, బిజెపిలను ప్రజలు నమ్మలేదని, బిఆర్ఎస్‌కే ప్రజలు ఓటేశారని, అందువల్ల బాజిరెడ్డి గెలుపు ఖాయమమని బిఆర్ఎస్ నేతలు అంటున్నారు. కౌంటింగ్ తరవాత కాంగ్రెస్, బిజెపిలకు దిమ్మ తిరగడం ఖాయమని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ప్రజల సమస్యలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. రైతులు విత్తనాల కోసం నానా తంటాలు పడుతున్నారని అన్నారు. ఇదిలావుంటే ఓట్ల లెక్కింపునకు జిల్లా అధికారులు పక్కగా ఏర్పాట్లు చేశారు. నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఓట్ల లెక్కింపు పక్రియ సజావుగా నిర్వహించాలని నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సీఎంసీలో జూన్ 4న నిర్వహించే పార్లమెంట్ ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లకు కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పలువురు సిబ్బంది సందేహాలను మాస్టర్ ట్రైనర్లు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులు అంకితభావంతో పనిచేయాలని, అనుమానాలు, గందరగోళానికి తావిచ్చేలా వ్యవహరించొద్దని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే సహాయ రిటర్నింగ్ అధికారుల దృష్టికి తేవాలని, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు ఓట్ల లెక్కింపు పక్రియలో క్రియాశీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు.

నేటి ఫోకస్ న్యూస్





# పుష్ప-2 సూసేకి అగ్గిరవ్వ పాట విడుదల

## శ్రేయా ఘోషాల్ గానంతో.. దేవిశ్రీప్రసాద్ సంగీతం

**అల్లు అర్జున్ హీరోగా** సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ సీక్వెల్ 'పుష్ప 2' ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలోని తొలిపాట విడుదలై ఇప్పటికే రికార్డులు సృష్టిస్తుండగా.. ఇప్పుడు రెండో సాంగ్ కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి..' అంటూ సాగే కపుల్ సాంగ్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. పుష్ప.. పుష్పరాజ్ .. నీయవ్వ తగ్గేదే లే' అంటూ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గడ్డం కింద చెయ్యి పెట్టి అడ్డంగా తిప్పితే.. వరల్డే షేకయింది. పుష్ప అంటే ప్లవర్ అనుకుంటివా.. ఫైర్' అంటే స్టార్స్ అందరూ ఫైర్ లెక్క ఫీలయ్యారు. ఇప్పుడు 'పుష్ప'కు కంటిన్యూగా రాబోతోన్న 'పుష్ప 2: ది రూల్'పై ఆకాశమే అవధి అన్నట్లుగా అంచనాలున్నాయంటే.. 'పుష్ప' ఎలా ప్రేక్షక హృదయాలను దోచుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే విడుదలైన 'గ్లింప్స్, టీజర్, పుష్ప పుష్ప సాంగ్' యూట్యూబ్‌లో ఆల్ టైమ్ రికార్డులను నెలకొల్పగా.. ఇప్పుడు మరో ట్రీట్ ఇచ్చారు మేకర్స్. 'పుష్ప 2: ది రూల్' నుంచి కపుల్ సాంగ్ 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాడే నా సామీ' లిరికల్ సాంగ్‌ను మేకర్స్ వదిలారు. ఈ పాటకు సంబంధించి ఇప్పటికే విడుదల చేసిన చిన్న ప్రోమో ఎలా వైరల్ అయిందో తెలిసిందే. మేకింగ్ విజువల్స్‌తో వచ్చిన ఈ కపుల్ సాంగ్.. 'నా సామి' పాటను బీట్ చేసేలా రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేశారు. అంతకుమించి అనేలా ఆస్కార్ విజేత చంద్రబోస్ సాహిత్యం అందించారు. అద్భుతమైన సాహిత్యంతో వచ్చిన ఈ పాటను 5 భాషల్లోనూ ప్రముఖ గాయని శ్రేయా ఘోషల్ పాడటం మరో విశేషం. ఈ పాట మేకింగ్ విజువల్స్ చూస్తుంటే.. ఐ ఫీస్ట్ అన్నట్లుగా ఉంది. అల్లు అర్జున్, రష్మికా మందన్నా మరోసారి తమ డ్యాన్స్‌తో దుమ్మురేపారనేది అర్థమవుతోంది. ఈ పాటతో 'పుష్ప 2: ది రూల్'పై క్రేజ్ డబులైంది. పుష్ప 2: ది రూల్'తో మరోసారి ప్రపంచంలోని సినిమా అభిమానులంతా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటవిశ్వరూపాన్ని చూడబోతున్నారు.






# మహారాజా చిత్రంలో విజయ్ సేతుపతి

**పాన్ ఇండియా స్టార్** ఇమేజ్ ఉన్న తమిళ నటుల్లో టాప్‌లో ఉంటాడు విజయ్ సేతుపతి. తమిళం, హిందీ, కన్నడ, మలయాళం, తెలుగు భాల్లో ఓ వైపు హీరోగా.. మరోవైపు నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో నటిస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు. ఈ స్టార్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి మక్కళ్ సెల్వన్ 50 నితిలన్ సామినాథన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి మహారాజా టైటిల్‌తో వస్తోంది. తాజాగా ట్రైలర్ అప్‌డేట్ అందించింది మక్కళ్ సెల్వన్ టీం. నిరీక్షణ దాదాపు ముగిసిపోయింది. మహారాజా ట్రైలర్ రేపు సాయంత్రం 5 గంటలకు రాబోతుందని మేకర్స్ కొత్త పోస్టర్ ఒకటి షేర్ చేశారు మేకర్స్. ముఖంపై గాట్లతో ఉన్న విజయ్ సేతుపతి చేతిలో కత్తి పట్టుకొని స్టన్నింగ్‌గా కనిపిస్తూ సినిమా ట్రైలర్‌పై క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు.ఇప్పటికే లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రక్తపు మరకలతో ఉన్న విజయ్ సేతుపతి చేతిలో కత్తి పట్టుకొని హెయిర్ సెలూన్ ఛైర్‌పై కూర్చున్నాడు. చెవికి పట్టీ కనిపిస్తుండగా.. పక్కనే పోలీసులు కూడా ఉన్నారు. అసలు ఏం జరిగిందనేది సస్పెన్స్‌లో పెట్టేసి సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు డైరెక్టర్. ప్యాషన్ స్టూడియోస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీలో బాలీవుడ్ దర్శకనిర్మాత అనురాగ్ కశ్యప్, మమతా మోహన్ దాస్, నట్టీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాంతార ఫేం అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు.



# పుష్ప-2లో తృప్తి డిమ్రితో ఐటమ్ సాంగ్..

## మరో సీరియల్ ఉందంటూ వినిపిస్తున్న టాక్..

**పుష్ప-2 చిత్రం విడుదలకు** ముందే అనేక సంచలనాలు వస్తున్నాయి. ఈ చిత్రంలో పాటలు శ్రేయాఘోషాలు పాడగా..ఐటమ్ సాంగ్ కోసం తృప్తి డిమ్రిని తీసుకుని వచ్చే ప్రయటత్నాలు సాగుతున్నాయని సమాచారం. మరో విశేషమేమంటే పార్ట్-3 కూడా ప్లాన్ చేస్తున్నారని టాక్. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'పుష్ప 2'.. గతంలో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'పుష్ప' సినిమాకు సీక్వెల్ గా ఈ సినిమా తెరకెక్కుతుంది. మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోన్న ఈ చిత్రాన్ని ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగల్ రిలీజ్ చేశారు. పుష్ప.. పుష్ప.. అంటూ సాగే ఈ పాట ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. ఏకంగా 100 మిలియన్ వ్యూస్ సాధించింది. ఇదిలా ఉంటే బుధవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగల్ రిలీజ్ అయ్యింది. స్టార్ సింగర్ శ్రేయ ఘోషల్ పాడిన ఈ కపుల్ సాంగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది అని మేకర్స్ చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో మేకర్స్ ఊహించని ట్విస్ట్ ఇవ్వనున్నట్లు సమాచారం. పుష్ప 3 కి సంబంధించి సమాచారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఈ సినిమాలో అదిరిపోయే ఐటెం సాంగ్ కూడా ప్లాన చేస్తున్నారని టాక్ నడుస్తోంది. యానిమల్ బ్యూటీ తృప్తి డిమ్రి ఈ సాంగ్‌లో ఆడిపాడనున్నారని వార్తలు వస్తున్నాయి. త్వరలోనే సుకుమార్ ఈ పాటను కూడా షూట్ చేసే అవకాశం ఉంది. అయితే పుష్ప-3 కూడా ఉంటుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు దాని గురించే అని టాక్. అల్లు అర్జున సరసన రష్మిక మందన్నా నటిస్తోన్న ఈ చిత్రంలో ఫవాద్ ఫాజిల్, సునీల్, అనసూయ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# మహారాణిగా కాజోల్




**బాలీవుడ్ నటి కాజోల్** కీలక పాత్రలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'మహారాజ్ఞి'. చరణ్‌తేజ్ ఉప్పల పాటి దర్శకుడు. ప్రభు దేవా, సంయుక్త, నసీరుద్దీషా, జిషుసేన్ గుప్త, ఆదిత్య సీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. సినిమాకు సంబంధించిన పాత్రలను పరిచయం చేస్తూ విడుదల చేసిన ఈ టీజర్‌లో కాజోల్ యాక్షన్‌తో అదరగొట్టారు. హిందీతో పాటు, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.